


వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సులకు

దళారులను ఆశ్రయించొద్దు



శ్రీనివాస్ రెడ్డి, డీటీవో

ప్రశ్న: వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సుల్లో దళారులను ఎలా నిలువరిస్తున్నారు?

జ: వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సుల కోసం వాహనదారులు ఏజెంట్లను ఆశ్రయించకుండా నేరుగా రవాణ శాఖ కార్యాలయానికి వస్తే పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో డ్రైవింగ్ లైసెన్సు రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర సేవలకై దరఖాస్తు చేసుకొని, ఈ సేవలోను దరఖాస్తు చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇచ్చిన సమయానికి నేరుగా కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సు పొందవచ్చు.

ప్రశ్న: ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్లకు ప్రవేశం ఉంటుందా?

జ: కామారెడ్డి ఆర్టీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర సేవల కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికే ప్రవేశం ఉంటుంది. ఏజెంట్లను ఎవరిని కూడా కార్యాలయంలోకి అనుమతి ఇవ్వడం లేదు. ఏజెంట్ల ద్వారా వచ్చిన దరఖాస్తులను వెనక్కి పంపుతున్నాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కార్యాలయంలోనే వంటనే పనులు అయ్యేలా చూస్తున్నాం. ఎవరైన ఆర్టీఏ సిబ్బంది పేరు చెప్పి డబ్బులు వసూళ్లు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రతీ రోజు ఎన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి?

జ: జిల్లా రవాణ శాఖ కార్యాలయంలో ప్రతీ రోజు 120 వరకు వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సులకు స్లాట్‌లు బుక్ అవుతుంటాయి. స్లాట్ బుక్ చేసుకున్న వారు సకాలంలో వస్తే రిజిస్ట్రేషన్ చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని వాహనాలు ఉన్నాయి?

జ: జిల్లా వ్యాప్తంగా 2,45,033 వివిధ రకాల వాహనాలు రవాణ శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలు 1,80,132, కార్లు 20,830, ట్రాక్టర్లు 10,933, ఆటోలు 8,264, గూడ్స్ వాహనాలు 6,793, ట్రాన్స్‌పోర్టు ట్రాక్టర్లు 4,190, అగ్రికల్చర్ ట్రాక్టర్లు 4,656, ట్రాలి వాహనాలు 2,920 రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. వీటితో పాటు ఇతర వాహనాలు కూడా ఉన్నాయి.

ప్రశ్న: వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సు, ఇతరత్రా సేవల పరంగా ఎంత ఆదాయం వస్తుంది?

జ: గత ఏడాది వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు లైఫ్ ట్యాక్స్, ఇతర ఫీజు రూపేన ప్రభుత్వానికి జిల్లా రవాణ శాఖ ద్వారా రూ.74కోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా 94 శాతం టార్గెట్‌ను పూర్తి చేశాం. ఈ సారి సెప్టెంబరు వరకు రూ.27.72 కోట్ల ఆదాయం వచ్చింది.

- కామారెడ్డి, ఆంధ్రజ్యోతి

గ్రామాలకు ప్రారంభమైన ఆర్టీసీ బస్సులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లింగంపేట-గోపాల్‌పేటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సు

లింగంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట - గోపాల్‌పేట, పొల్కంపేట - లింగంపేట, బాణాపూర్-గాంధారి గ్రామాల రూట్‌లో వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు పునఃప్రారంభమయ్యాయి. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం 'బస్సు వస్తలేదు.. బాధలు తప్పట్లేదు' అనే వార్తకు ఆర్టీసీ అధికారులు స్పం దించి గురువారం వివిధ గ్రామాలకు బస్సులను పునరుద్ధరించారు. సుమారు రెండు నెలలుగా ఆర్టీసీ బస్సులు గ్రామాలకు రాకపోవడంతో గ్రామాల ప్రజలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం బస్సులు ప్రారంభం కావడంతో ప్రజలు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.



డిఫాల్ట్ మిల్లులకు..

కేటాయింపులు లేవు

రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రతి ఏటా ఆయా రైస్‌మిల్లులకు కేటాయిస్తుంటారు. రైస్‌మిల్లర్లు మర ఆడించి సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి బియ్యాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని, పలు రైస్‌మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి ధాన్యం కేటాయింపుల్లో కఠిన నిర్ణయాలు తీసుకుంది.

- జిల్లాలో 30 రైస్‌మిల్లులను డిఫాల్ట్ కింద చూపిన అధికారులు
- సకాలంలో సీఎంఆర్ ఇవ్వనందుకే డిఫాల్ట్‌లోకి
- 2024-25 వానాకాలం, యాసంగి సీఎంఆర్ మిల్లుల వద్దే
- ప్రస్తుతం 52 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు
- జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

కామారెడ్డి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సకాలంలో సీఎంఆర్ ఇవ్వని మిల్లులను డిఫాల్ట్‌లో పెట్టాలని వారిపై ఆర్‌ఆర్ చట్టం ప్రయోగించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అదేవిధంగా ఈ వానాకాలం ధాన్యం కేటాయింపులు చేయవద్దని జీవో జారీ చేసింది. దీంతో జిల్లాలో డిఫాల్ట్‌లో ఉన్న రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు అధికారులు చేయడం లేదు. మిగితా మిల్లులు సైతం బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే కేటాయింపులు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 52 మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 179కి పైగా రైస్‌మిల్లులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో 179కిపైగా రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో 136 రా రైస్‌మిల్లులు ఉండగా మరో 35కి పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాలకు ప్రతీ నెల పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.53లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీనెల 5,462 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి ప్రతీ ఏటా రెండు సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.

(మిగతా 8లో..)



మురిసిన మద్యం షాపుల

టెండరు గడువు

- గడువు పొడగించడంతో పెరిగిన దరఖాస్తులు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- ఈనెల 27న లక్కీడ్రా ద్వారా టెండర్లు ఓపెన్ చేసేందుకు కసరత్తు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల దరఖాస్తులకు గురువారంతో గడువు ముగిసింది. గత నెల 26న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 18 వరకు చేపట్టేలా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకున్నప్పటికీ గత సంవత్సరంతో పోలిస్తే దరఖాస్తులు తక్కువ రావడంతో మరింత గడువు పెంచింది. దీంతో జిల్లాలో 49 మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ సాగింది. గతంలో జిల్లాలో 49 షాపులు ఉండగా 2204 మంది దరఖాస్తులు చేసుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది రూ.3 లక్షలు దరఖాస్తు ఫీజును ప్రకటించారు. అయితే దాదాపు 1500లకు పైగా దరఖాస్తులు వచ్చినప్పటికీ దరఖాస్తుల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగడంతో పూర్తి దరఖాస్తుల వివరాలు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం వెల్లడించే అవకాశం ఉంది.

అదృష్టవంతులు ఎవరో?

జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. జిల్లావ్యాప్తంగా 5 ఎక్సైజ్ పోలీసుస్టేషన్లైన కామారెడ్డి, దోమకొండ, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుందలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయి. గురువారం రాత్రి వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగింది. దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో ఈనెల 27న జిల్లా కేంద్రంలోని రేణుకదేవి కల్యాణ మండపంలో లక్కీడ్రా నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ సమక్షంలో ఆయా వైన్స్‌లకు వచ్చిన దరఖాస్తులపై లక్కీడ్రా తీస్తారు. ఈ లక్కీడ్రాలో వైన్స్‌ల అదృష్టవంతులు ఎవరో తేలనుంది.



పోలియోను

తరిమేద్దాం

- 0-5 సంవత్సరాల పిల్లలకు వచ్చే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి పోలియో
- చిన్నారుల నాడీ వ్యవస్థను దెబ్బతీసి బలం కోల్పోయేలా చేస్తుంది
- జిల్లాలో 15 ఏళ్లుగా జీరో కేసుల నమోదు
- అప్పుడే పుట్టిన పిల్లలకు వారానికి రెండు సార్లు టీకాలు
- పుట్టిన ప్రతీ చిన్నారికి టీకాలు వేసేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

కామారెడ్డి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన పిల్లలనుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు వచ్చే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి పోలియో. పోలియో అనేది వైరస్ వల్ల సంక్రమిస్తోంది. ఈ వైరస్ చిన్నారుల నాడీ వ్యవస్థ దెబ్బతీసి కండరాలు బలం కోల్పోయో స్థితికి తీసుకువస్తోంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులకు ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమించడమే కాకుండా తీవ్రమైన దుష్పలితాలను చూపిస్తాయి. అందుకే అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయిస్తే అంగవైకల్యం నుంచి వారిని రక్షించడంతో పాటు పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దామని ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ కలిసి అక్టోబరు 24ను ప్రపంచ పోలియో నివారణ దినం నిర్వహిస్తోంది. అయితే 2014లోనే భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా డబ్ల్యుహెచ్‌వో ప్రకటించింది. జిల్లాలో సైతం గత 15 సంవత్సరాల నుంచి కేసు ల నమోదు పోలియో భారిన పడిన చిన్నారుల సంఖ్య జీరోగానే నమోదవుతుందని వైద్యఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వారానికి రెండు సార్లు పోలియో టీకాలు వేస్తున్నామని పుట్టిన ప్రతీ చిన్నారికి టీకాలు వేసేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పోలియో వ్యాధి వ్యాప్తి - లక్షణాలు

అపరిశుభ్రమైన పరిసరాల్లో ఆటలు ఆడుతూ కాలు, చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారాన్ని భుజించే పిల్లలకు సాధారణంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ (మిగతా 8లో..)



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు

40 మంది క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా ఖోఖో సీనియర్ పోటీలను గురువారం నిర్వహించినట్లు ఖోఖో అసోసియేషన్ కోశాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 328 మంది క్రీడాకారుల్లో 150 మంది మహిళల క్రీడాకారులు, 178 మంది పురుషులు పాల్గొన్నారన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మంది పురుషులు, మరో 20 మంది మహిళ క్రీడాకారినులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారు ఈ నెల 25 నుంచి నవంబరు 5వ తేది వరకు పిట్లంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించే శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. తర్వాత నవంబరు 6 నుంచి 9వ తేది వరకు పెద్దపల్లి జిల్లాలో నిర్వహించే 58వ రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో కామారెడ్డి డీవైఎస్‌వో రంగ వెంకటేశ్వర్ గౌడ్, నిజామాబాద్ ఖోఖో అసోసియేషన్ చైర్మన్ అనిల్, అధ్యక్షుడు భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి. అతికుళ్ల, ఆర్గనైజింగ్ సెకరేటరి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మన్మథస్వామి పాదయాత్ర

బిచ్కుంద, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బిచ్కుంద సద్గురు బండయ్యప్పస్వామి మఠసంస్థాన్ నుంచి శుక్రవారం మన్మథస్వామి పాదయాత్ర బయలు దేరుతున్నట్లు మఠాధిపతి సోమలింగ శివచార్య స్వామిజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బిచ్కుంద నుంచి కార్తిక మాసంలో పాదయాత్ర 13 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



1.5 లక్షల మెట్రిక్ టన్నుల

కొనుగోళ్లే లక్ష్యం

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 194 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాల ద్వారా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యం ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ తెలిపారు. మండలంలోని గోపాల్‌పేట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఐకేపీ సిబ్బందిని, మహిళా సంఘాలను ఆదేశించారు. జిల్లాలో 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 233, ఐకేపీల ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా 194 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గతేడాది ఐకేపీ ఆధ్వర్యంలో జిల్లాలో 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో గతేడాది కంటే 13 కేంద్రాలను పెంచామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో ఐకేపీ కేంద్రాల ద్వారా 8039 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. రైతులు మేచర్ వచ్చిన ధాన్యాన్ని తేవాలని, తేమశాతం 17 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఆన్‌లైన్ చేసిన అనంతరం 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు యూనిఫాంలు 62శాతం వచ్చాయన్నారు. మొత్తం యూనిఫాంలు వచ్చిన తరువాత ప్రతి మహిళకు అందజేస్తామని చెప్పారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తిరుమలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం దోమకొండలో జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమిత్ర, అశ్విని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించినప్పుడే మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారని అన్నారు. ఈ మేరకు విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయుడు పీర్యా, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పక్కన ఉన్న పాత ఇంజనీరింగ్ కళాశాల భవనాన్ని సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పాటు, పలుచోట్ల మరమ్మతులు చేయించాలని, పరిసరాల్లో పరిశుభ్రత పాటించేలా చేయాలని తెలిపారు. జిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడంతో పాటు శాస్త్రీయ వైఖరులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. విద్యార్థులు, యువత ప్రజలకు విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మార్కౌట్ వంద శాతం పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మార్కౌట్ పనులు వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు కట్టివ్వాలనే లక్ష్యంతో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతీ అర్హత గల కుటుంబం త్వరితగతిన తమ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించేందుకు అవసరమైన స్థల మార్కింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు తమ తమ మండలాల్లో పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మార్కౌట్ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది (మిగతా 8లో..)



మ్యూజియం ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

చెప్పినంతే రేటు.. అమ్మకుంటే చేటు

- పంట విక్రయాల్లో సోయా రైతుల అవస్థలు
- ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు



7

కొనసాగుతున్న శరభేశ్వర స్వామి

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

- ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం ఏర్పాటు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



8

క్రైం సమాచారం

అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు


శకుంతల (ఫైల్)

బీర్కూర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతునగర్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా.. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నసురుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామానికి చెందిన శకుంతల, సాయగౌడ్‌ల బంధువు ఒకరు బీర్కూర్ మండలం కిస్టాపూర్‌లో మృతిచెందారు. దీంతో సాయాగౌడ్ తన భార్య శంకుతలతో కలిసి అంత్యక్రియలకు ద్విచక్రవాహనంపై కిస్టాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో రైతునగర్ వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శంకుతల అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. సాయాగౌడ్‌కు రెండు కాళ్లు విరగడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలి దుర్మరణం

నవీపేట,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నవీపేట, బాసర రైల్వే స్టేషన్‌ల మధ్యన బుధవారం రాత్రి 60 నుంచి 65 సంవత్సరాల వయసు గల వృద్ధురాలు రైలు నుంచి జారిపడి మృతి చెందిందని నిజామాబాద్ రైల్వే ఎస్‌ఐ సాయిరెడ్డి తెలిపారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో ఢీ ఒకరి మృతి

ఇందల్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆటో అతివేగానికి ఓ నిండుప్రాణం బలైంది. ఈ ఘటన డిచ్‌పల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి నుంచి ధర్పల్లి మండలం రామడుగుకు ఆటోలో ఆరుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. అయితే డ్రైవర్ తలారి గంగాధర్ అతివేగంగా ఆటోను నడుపుతూ.. సుద్దపల్లి శివారులో సాంపల్లి గ్రామస్థుడైన అంతరెడ్డి గంగారెడ్డి(60)ను ఢీకొట్టాడు. దీంతో గంగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. ఆటోసైతం బోల్తా పడి డ్రైవర్‌తో సహా ఆరుగురికి గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు వెంటనే గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు.

బాలుర మిస్సింగ్ కథ సుఖాంతం

వర్ని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటయ్య క్యాంపు లోగల ఎస్టీ బాలుర వసతి గృహం నుంచి ఇద్దరు బాలురు అదృశ్యం కలకలం రేపింది. దీపావళి సందర్భంగా ఇంటికి వెళ్లిన సదరు విద్యార్థులను వారి తల్లిదండ్రులు వసతిగృహానికి తీసుకొచ్చారు. బుధవారం ఇద్దరు బాలురు అదృశ్యం అయ్యారు. దీంతో ఖంగు తిన్న తోటి విద్యార్థులు కోటగిరి మండలం సుద్దులం తండా, వర్ని మండలం బెల్యానాయక్‌తండాలోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేష్ అప్రమత్తమై సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం విద్యార్థులు వసతి గృహం సమీపంలో పోలీసులకు పట్టుబడ్డారు. హాస్టల్ వార్డెన్, నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు భద్రత లేకుండా పోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. సక్రమంగా నాణ్యత లేని భోజనం పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరాలపై బాన్సువాడ పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. ఎస్‌హెచ్‌వో తుల శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వీక్లీ మార్కెట్ ఏరియాలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి నుంచి రూ.4190 నగదు, 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కామారెడ్డిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మన్నింబాచల క్షేత్రం.. బ్రహ్మోత్సవాలకు సిద్ధం

26 నుంచి లింబాద్రిగుట్టపై వేడుకలు ▸▸ కొండపై దర్శనమివ్వనున్న లక్ష్మీనరసింహస్వామి

కొనసాగుతున్న ఏర్పాట్లు ▸▸ నవంబరు 7 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



భీమ్‌గల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలోని పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి (శ్రీ మన్నింబాల క్షేత్రం) ఆలయంపై ఈ నెల 26 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో లింబాద్రి గుట్ట కార్తిక శోభ సంతరించుకోనుంది. స్వయంభూ నృసింహ క్షేత్రాల్లో శ్రీమన్నింబాచల క్షేత్రం ఒకటి. ఈ పర్వతం అత్యధిక ఔషద గుణాలు గల వేప చెట్లతో నిండి ఉండడంతో ఈ నింబాచలం అనే పేరొచ్చింది. ప్రహ్లాదుడు, బ్రహ్మదేవుడి కోరిక మేరకు గుట్టపై నరసింహస్వామి వారు వెలసినట్టు ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతంలో బ్రహ్మదేవుడు, వాయుదేవుడు, రుద్రుడు యమధర్మరాజు తపస్సు చేసినందు వల్ల దక్షిణ భారత దేశంబరిగా పేరుగాంచి దక్షిణ బద్రిగా నిలుస్తోంది. అంతేకాకుండా స్వయంభూ నరనారాయణులు ఇక్కడే ఉన్నారని చరిత్ర చెబుతోంది. కొండపై గుహల్లో మూల విరాట్ రూపంలో స్వామి వారు దర్శమిస్తారు. లింబాద్రి గుట్టకు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న భీమ్‌గల్ గ్రామ ఆలయంలో సంవత్సరం పాటు స్వామివారు పూజలందుకుంటున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గ్రామాలయంలో ఉత్సవమూర్తులను గుట్టపై ఆసీనులు చేసి నగలతో అలంకరించి 10 రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

నంబీ వంశస్థుల పూజలు..

ఏటా వైశాఖ మాసంలో గ్రామాలయంలో నంబి వంశస్థులు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ మండలం 100 ఏళ్ల కిందట నిర్మించినట్లు, ఇక్కడ 32తరాల నుంచి నంబి వంశస్థులు పూజలు నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్నారని పురాణాలు చెబుతున్నాయి. గుట్ట పరిసరాల్లో విరాజ్ నది ఉందని, భక్తులు నదిలోనే స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.

సంతాన వరప్రదాయిని.. బ్రహ్మోత్సవాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు హాజరవుతారు. కార్తికమాసంలో ఇక్కడ మొక్కులు తీర్చుకున్న వారికి సంతానం కలుగుతుందని నమ్మకం. కనుక స్వామివారి కళ్యాణం, పౌర్ణమి రోజు జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

గుట్టపై నిర్వహించే కార్యక్రమాలివే..

లింబాద్రి గుట్టపై కార్తిక మాసంలో అక్టోబర్ 26 నుంచి నవంబరు 7 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. నిత్య బ్రహ్మోత్సవాల ఆరంభం సందర్భంగా పెద్దంగంటి ఎల్లమ్మకు నంబి వంశస్థులు ఆదివారం సారె సమర్పణ, 27న గ్రామాలయంలోని దేవతామూర్తులు కొండపైకి బయలుదేరుతారు. 28న దీపారాధన, అంకురార్పణ, 29న ధ్వజారోహణం, 30న శ్రవణ ప్రయోక్తా, క్షీరాభిషేకం, శ్రీవారి ఎదుర్కోళ్లు, 31న శ్రీవారి కళ్యాణం, నవంబరు 1న నృసింహ ఏకాక్షరి హవనం, 2న గరుడ సేవ, 3న తులసి వివాహం, గిరి ప్రదక్షిణ, 4న సీతా నగరంపై డోలారోహణం, 5న జాతర, రథ, భ్రమణం, 6న తిరుమంజనం, చక్రతీర్థం, 7న కొండబలి, పుష్కరినిపై డోలోత్సవం నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు నంబి పార్థసారథి తెలిపారు. ఇదే రోజు లక్ష్మీనరసింహులు గ్రామాలయానికి చేరుకుంటారు.


కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కాంగ్రెస్ నేతకు పరామర్శ

రెంజల్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేసుకున్న కాంగ్రెస్ రెంజల్ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్‌ను గురువారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. 15రోజుల క్రితం గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లో గుండెకు శస్త్ర చికిత్స చేసుకోవడంతో ఆయనను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జావీదోద్దీన్, కార్తీక్, కిరణ్, హాజీఖాన్, నితిన్, రవి తదితరులున్నారు.

చెక్కుల అందజేత

రెంజల్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలికి చెందిన అర్షద్ ఖాన్‌కు రూ.12వేలు, కమలాబాయికి రూ.24,500 చెక్కులను గురువారం కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహకారం అందుతుందన్నారు.


కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరగొద్దు

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆలూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆలూర్ మండలం డీకంపల్లిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, జీపీ కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత

మాక్లూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, మాక్లూర్ బీజేపీ అధ్యక్షురాలు మమత, పోశెట్టి, భరత్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి సాయం చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ

మోస్రా,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ రూపంలో లక్ష రూపాయలు సాయం చేస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంతోపాటు మండలంలోని చింతకుంట, తిమ్మాపూర్, గోవూర్, మోస్రా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం గృహలక్ష్మీ పథకాల ద్వారా నిరుపేదలకు సొంత ఇంటి కలను నిజం చేస్తోందన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి పౌష్టికాహారం అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్థానికులు అడిగిన పలు సమస్యలకు అధికారులను ప్రశ్నించి వారి ద్వారా సమాధానం ఇచ్చారు. గురుకులాల, మోడల్ వంటి హాస్టళ్లలో ఉచిత విద్య, అన్ని సౌకర్యాలు ఉంటాయని ప్రజలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా వివిధ గ్రామ పంచాయతీలలో వివిధ రోడ్డు పనుల వివరాలు వాటి సంబంధిత నిధుల వివరాలు గతంలో చేసిన పనుల వివరాలు తెలుసుకుని పనులను నాణ్యత లోపం లేకుండా పూర్తి చేసే విధంగా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, సీడీపీవో పద్మ, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏవో వెంకటేష్, ఏఈవో సప్తగిరి, ఉమ్మడి వర్ని మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సీనియర్ నాయకులు పిట్ల రాములు, హరినారాయణ, సుధాకర్ రెడ్డి, లింగయ్య, భూమయ్య, మండల అధికారులు నాయకులు పాల్గొన్నారు.


మండల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

చెక్కుల పంపిణీ

వర్ని, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను నసురుల్లాబాద్ మండలకేంద్రంలో అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, వీర్రాజు, కిషన్, రాము, గిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన నంద్యాల రైతులు

కమ్మర్‌పల్లి,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పసుపు పరిశోధనకేంద్రాన్ని ఆంధ్ర ప్రదేశ్ స్పైస్ బోర్డు గుంటూరు ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా మహానంది, గిద్దలూర్‌కు చెందిన చెందిన 35 మంది పసుపు రైతులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పసుపు పరిశోధనలు, నూతన వంగడాలు, పంట దిగుబడులు, యంత్ర పరికరాలు పనిచేసే విధానం, కేంద్రంలో చేడుతున్న పసుపు పరిశోధనలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పసుపు పంటను పండించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు,దుంపకుల్లు నివారణకు చేపడుతున్న పరిశోధనలు, క్యాప్సుల్స్ తదితర వివరాలపై శాస్త్రవేత్త మహేందర్ పవర్ ప్రజంటేషన్ ద్వారా వారికి వివరించారు. కార్యక్రమంలో స్థానిక శాస్త్రవేత్తలు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పసుపు పంటను పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా రైతులు

పోషకాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణ

మోపాల్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): తల్లి, బిడ్డకు పోషకాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. గురువారం గుండారంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణులు, తల్లులు, చిన్నారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందజేస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన రాష్ట్ర నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 33 అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాత భవనాలకు మరమ్మతులు, లైటింగ్, బాత్రూములు, వంటగదుల సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు పంపించామని, త్వరలో అన్ని అంగన్వాడీ ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం పోషకాహార పదార్థాలు తయారు చేసిన అంగన్వాడీ టీచర్లకు బహుమతులు అందజేశారు. గర్భిణుల సీమంతం కార్యక్రమంలో పాల్గొని పండ్లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఐసీడీఎస్ పీడీ రసుల్‌బీ, ఏఎంసీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఐసీడీఎస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పాదయాత్రతో సకలశుభాలు

బోధన్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంగంగల్లీలోని పౌడయ్య మఠం ఆధ్వర్యంలో వీరశైవ జంగమ లింగాయత్ సౌజన్యంతో సిద్దేశ్వర మహరాజ్ సుంకిని మార్గదర్శకత్వంలో గురువారం ఏకచక్రేశ్వర శివాలయం నుంచి కపిల్‌ధార్ మన్మథ స్వామి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైర లింగాయత్ రాష్ట్ర సభ్యులు శ్యామ్‌రావు, కార్యక్రమ నిర్వాహకులు పురాణే అజయ్ కుమార్ మాట్లాడుతూ మన్మథ స్వామి పాదయాత్రతో సకల శుభాలు కలుగుతాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ యాత్ర 15 రోజుల్లో 360కిలో మీటర్ల ప్రయాణం కొనసాగుతుందన్నారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మంజర్‌సోంబ గ్రామంలోని కపిలధార జలపాతంలో పుణ్యస్నానం చేసి మన్మథ స్వామి దర్శనంతో యాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో వీరశైవ జంగమ లింగాయత్ అధ్యక్షుడు నర్సింగ్ అప్ప, లక్ష్మణ్ పటేల్, పురాణే అజయ్ కుమార్, పౌడయ్య రాజేందర్, పట్టణ ప్రముఖులు గుమ్ముల అశోక్ రెడ్డి, సమాజ ప్రముఖులు గంగాధరప్ప, శంకరప్ప, విఠలప్ప, యాదవ్ రావు పటేల్, ప్రభు అప్ప, శివ, సంగు పటేల్, గంగారాం, నాగభూషణం, పురాణే దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బోధన్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

చేతివృత్తులతో గౌరవప్రదమైన జీవనం

బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్‌కృష్ణ

బోధన్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల ద్వారా గౌరవప్రదమైన జీవనం సాగించవచ్చని బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని మహలక్ష్మి కల్యాణ మండపంలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రషన్ ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళలు తమ పిల్లలను విద్యావంతులుగా చేయడమే లక్ష్యంగా మెరుగైన జీవన విధానాలకు అలవాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్‌ఐ భాస్కర్‌చారి, ఫ్రూట్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ నయీం, సొసైటీ కౌన్సిలర్ అన్విత, మౌనిక తదితరులున్నారు.


మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ కృష్ణ

ఓసీలకు రిజర్వేషన్ కల్పించాలి

ఏర్గట్ల, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీల మాదిరిగానే ఓసీలకు కూడా ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించాలని సంఘాల సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దోంచందలో ఓసీ సంఘాల సభ్యులు సమావేశం ఏర్పాటుచేసిమాట్లాడారు. ఓసీలను జనరల్ కేటగిరీ నుంచి తొలగించి రిజర్వేషన్ ఇవ్వాలన్నారు.


సమావేశమైన నాయకులు

ఆసిఫ్‌కు మైనార్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ

సుభాష్‌నగర్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని సారంగాపూర్ ప్రాంతంలో పాత నేరస్థుడు రియాజ్ చేతిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆసిఫ్‌ను రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన రియాజ్‌ను పోలీసులు పట్టుకోవడంలో ఆసిఫ్ చూపిన తెగువ, కనబర్చిన ధైర్య సాహసం ప్రశంసనీయమని అభినందించారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటానికి పోలీసులు, పౌరులు కలిసి పని చేయడం అవసరమని పేర్కొన్నారు. ఆసిఫ్‌ను హైదరాబాద్ లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించడంతో పాటు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తున్న పోలీసు శాఖను చైర్మన్ తారిక్ అన్సారీ అభినందించారు.


ఆరోగ్యపరిస్థితిని తెలుసుకుంటున్న చైర్మన్


టీకా వేస్తున్న పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్

పశువుల పట్ల శ్రద్ధ వహించాలి

మోర్తాడ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువుల పట్ల శ్రద్ధ వహించాలని పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్ సూచించారు. గురువారం వడ్యాట్‌లో పశువైద్య శాఖ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. 115 ఆవులు, గేదెలకు గాలికుంటు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది థైసిల్, ప్రభాకర్, జమీన్, ప్రభాస్, పాడి రైతులు గంగాధర్, స్వప్న, గంగారాం పాల్గొన్నారు.

కలిగోటలో పశువులకు టీకాలు

జక్రాన్‌పల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగోటలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్యాధికారులు వేశారు. గ్రామంలో 324 పశువులకు, 98 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ ఆశ్రిత తెలిపారు. పాడి రైతులు పశువుల పట్ల శ్రద్ధ వహించాలని, లేకపోతే పాల ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని వివరించారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు రాజ్‌కుమార్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై సమీక్ష

కలెక్టర్‌ను అభినందించిన వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పాల్గొన్న పోచారం

సుభాష్‌నగర్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లు, ఏపీఎంలు, ఏఓలు, ఏఈఓలు, ఐకేపీ కేంద్రాల ఇన్‌చార్జులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మోస్రా తహసీల్దార్ కార్యాలయం నుంచి వీసీలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్ల గురించి సంతృప్తి వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను అభినందించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బాన్సువాడ సెగ్మెంట్ పరిధిలో అన్ని ధాన్యం కొనుగోలుకేంద్రాలు సజావుగా కొనసాగుతున్నాయన్నారు. రుద్రూర్ మండలంలో కొన్ని కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులతో అనుసంధానం చేయలేదని ప్రస్తావించగా, గురువారం రోజున ట్యాగింగ్ చేశామని కలెక్టర్ తెలిపారు. కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే వారిదే బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే రెండు రోజులలో జిల్లావ్యాప్తంగా నిర్దేశిత ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను తెరువాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఆర్‌డీఓ సాయాగౌడ్, డీఎస్‌ఓ అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ గంగుబాయి, డీసీఓ శ్రీనివాస్, డీఏవో గోవిందు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు తీర్చాలి

ముప్కాల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ కోతలు తీర్చాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన కరెంట్ అందించాలని, అదే విధంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ క్షేత్రాల్లో కోత లేకుండా రైతులకు విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి, పృథ్వీ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు 'డియర్ ఫ్రాంక్లిన్'

దక్షిణ భారత పోటీలకు ఎంపికైన నాటకం ▸▸ విజయ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఇందూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత నాటక పోటీలకు నగరంలోని విజయ్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ప్రభాదేవి గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు గోదావరి ఆడిటోరియంలో దక్షిణ భారత గ్రామ ఫెస్టివల్‌లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకు చెందిన బడుల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో విజయ్ హైస్కూల్లో పదో తరగతి చదివే ఎ.రాజ్‌కరణ్‌రెడ్డి, సీహెచ్ ప్రేరణ, ఎం హర్షవర్ధన్, టి.విజితేంద్రియ, 9వ తరగతి నుంచి పి.రోహన్ రెడ్డి, ఎస్.రోషన్, పి.నిహాల్ కృష్ణ, టి. కృతిక మహిళా సాధికారత అనే అంశంలో 'డియర్ ఫ్రాంక్లిన్' అనే నాటికను జిల్లాస్థాయిలో ప్రదర్శించి, ప్రథమస్థానాన్ని పొందగా, రాష్ట్రస్థాయికి ఎంపికై అక్కడా ప్రథమస్థానాన్ని పొంది, నవంబరులో బెంగళూరులో జరిగే దక్షిణ భారత పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నాటకానికి కరస్పాండెంట్ వి. ప్రభాదేవి దర్శకత్వ బాధ్యతలు చేపట్టగా పదో తరగతి విద్యార్థి టి. విజితేంద్రియ లైటింగ్ , మ్యూజిక్ మేనేజెమెంట్ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాటికలో పాల్గొన్న విద్యార్థులను, దర్శకురాలు ప్రభాదేవిని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, విజయ్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు డా. అమృతలత, సొసైటీ సభ్యురాలు తారాచౌదరి అభినందించారు.


విద్యార్థులను, విజయ్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభాదేవిని అభినందిస్తున్న డీఈవో అశోక్

విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం విద్యార్థులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఏడీఈ నగేష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు రైతులు, విద్యార్థులు గ్రామ పరిధిలో వదులుగా, తక్కువ ఎత్తులోని విద్యుత్ తీగలు, ఇలాంటి సమస్యలు గుర్తిస్తే లైన్‌మెన్‌కు తెలియజేయాలన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ. కిషోర్ రెడ్డి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, లైన్‌మెన్‌లు పవన్, సాయిబాబా, బాలరాజు, పాఠశాల హెచ్ఎం సునీత తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

భీమ్‌గల్‌రూరల్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకంలో కొత్త పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవో సంతోష్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ కూలీలు చేపట్టాల్సిన పనులు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

టైం టేబుల్ విడుదల

ఇందల్వాయి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ (5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్స్) (ఏపీఈ, ఐపీసీహెచ్) 7, 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు అక్టోబర్ 31నుంచి నవం బరు 6 వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి సంపత్ కుమార్ తెలిపారు.

4 రోజుల జైలు శిక్ష

ధర్పల్లి, అక్టోబర్ 23, (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి న్యూసెన్స్ చేసిన సీతాయిపేట్‌కు చెందిన భానుచందర్‌పై కేసు నమోదుచేసి గురువారం న్యాయస్థానం ముందు హాజరుపర్చినట్లు ఎస్ఐ కళ్యాణి తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అతడికి 4 రోజుల జైలు శిక్ష విధించడంతో అతన్ని జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

పిట్లం, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ ద్వారా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, విండో చైర్మన్లు శపథం రెడ్డి, నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హనుమాండ్లు, నాయకులు మోహన్ రెడ్డి, విండో వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఇమ్ము రోజ్, అశోక్, చంద్రశేఖర్, మోయిన్, నాయకులు రైతులు పాల్గొన్నారు.

నిజాంసాగర్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగి గ్రామంలో ఇందిరా క్రాంతిపథం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన మాగి గ్రిల్స్ దాబ యజమాని శ్రీనివాస్ విద్యార్థుల కోసం తయారుచేయించిన బెల్టు, బ్యాడ్జిలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్, నాయకులు శ్రీనివాస్, బంగారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ విజేతగా కొండాపూర్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ భిక్షపతి

సిరికొండ, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు బానిసలుగా మారి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ధర్పల్లి సీఐ భిక్షపతి సూచించారు. సిరికొండ మండలకేంద్రంలో 2 రోజుల పాటు జరిగిన వాలీబాల్ క్రీడల ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతుల ప్రదానం అనంతరం ఆయన మాట్లాడారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనే లక్ష్యంతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలను నిర్వహించామన్నారు. ఈ టోర్నీలో సిరికొండ, ధర్పల్లి మండలాల నుంచి సుమారు 30 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కాగా విజేతగా కొండపూర్ జట్టు, ద్వితీయ బహుమతిని ఎస్‌బి తండా జట్టు, హొన్నాజీపేట్ జట్టు తృతీయ బహుమతిని గెలుచుకుందని తెలిపారు. ఎస్సైలు రామకృష్ణ, కళ్యాణి, పాఠశాలల యాజమాన్యాలు హరీష్, మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసులు

బాన్సువాడటౌన్, ఎల్లారెడ్డి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరు వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం బాన్సువాడ పట్టణ పోలీసులకు ఎస్‌హెచ్‌వో తుల శ్రీధర్ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడం, పనిచేసే స్థలాలలో లింగ వివక్షత అంశాలపై పోటీలను నిర్వహించామన్నారు.

●ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశంపై వ్యాసరచన పోటీని మూడు భాషల్లో నిర్వహించారు. ఉత్తమంగా రాసిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు

బీర్కూర్ నుంచి శబరిమలకు పాదయాత్ర



శబరిమలకు పాదయాత్రగా తరలివెళ్తున్న అయ్యప్ప స్వాములు

బీర్కూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రం నుంచి అయ్యప్ప స్వాములు కేరళ రాష్ట్రంలోని శబరిమలకు గురువారం పాదయాత్రగా తరలివెళ్లారు. స్వాములు మొదట స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. గ్రామ ప్రజలు గ్రామ పొలిమేర వరకు వారిని సాగనంపారు. 1400 కి.మీ మేర కాలినడక చేపట్టి స్వామిని దర్శించుకుంటామని వారు తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

ఎల్లారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో జమదగ్ని, చింతల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించేందుకు గౌడ సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం గోపూజ, గణపతి పూజతో ప్రారంభం అవ్వనుండగా, ఈనెల 25న శాంతి పాఠం, నిత్యపూజ, ఎల్లమ్మ తల్లి, చింతల పోచమ్మ తల్లి మూలమంత్ర హవనములు ప్రదోష, తీర్థప్రసాదాల వితరణ, 26న రేణుక ఎల్లమ్మ పరివారం, చింతల పోచమ్మ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, 27న ఉదయం 11 గంటలకు కుంకుమార్చన, సాయంత్రం పుట్టధ్వని, గంగ బోనం, 28న ఉదయం రేణుక జమదగ్ని కళ్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం పోచమ్మ, ఎల్లమ్మ తల్లి బోనాల ఊరేగింపు, గావు పట్టుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నిర్వాహకులు ప్రశాంత్ గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

కారోబార్‌ల సమస్యల పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాగౌడ్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న కారోబార్లు గురువారం మండల కేంద్రంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారోబర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గా గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని, కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. జీవో51ని సవరించి అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కారోబార్లు సదానందం, కృష్ణమూర్తి, మజ్జూర్, బాలయ్య, సంగారెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చెప్పినంతే రేటు.. అమ్ముకుంటే చేటు

▸▸ పంట విక్రయాలలో సోయా రైతుల అవస్థలు ▸▸ ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని వేడుకోలు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంటగా సాగుచేసిన సోయా పంట చేతికొచ్చింది. కానీ విక్రయిద్దామంటే ఇబ్బందులు తప్పట్లేదు. ఓవైపు కొనుగోలు కేంద్రాలు లేక వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకునే పరిస్థితి. కొంతకాలం ఆగుదామంటే నిల్వ ఉంచేందుకు స్థలం లేక ఇబ్బంది. ఇలా ఎటుచూసినా సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

● పంట చేతికి వచ్చి పక్షం రోజులకు పైగా కావస్తుండటంతో పంటను ఇళ్లలో నిల్వఉంచుకోలేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. అంతేగాక పంట నిల్వకు అవసరమైన గోదాంలు సైతం లేకపోవడంతో పంటను ఎక్కడ దాచిపెట్టాలో తెలియక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్నారు. గతంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర క్వింటా సోయాకు రూ.5328 ఉండగా, బయట వ్యాపారులు కేవలం రూ.4 వేల నుంచి రూ.4150 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు క్వింటా సోయాకు సుమారు 4కిలోల వరకు తరుగు తీసుకుంటున్నట్లు సమాచారం. సోయా పంట అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతోనే ప్రైవేటు వ్యాపారులు పంట ధరను తక్కువకు నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేదంటే వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు.



సోయా బస్తాలను మార్కెట్‌కు తరలిస్తున్న దృశ్యం

నలుగురు సొసైటీ డైరెక్టర్లపై అనర్హత వేటు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట సొసైటీకి చెందిన నలుగురు డైరెక్టర్ల (పీఏసీ మెంబర్లు)పై జిల్లా కోఆపరేటివ్ అధికారి రామ్మోహన్ అనర్హత వేటు వేసినట్లు సొసైటీ సీఈవో మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట సొసైటీకి చెందిన డైరెక్టర్లు (పీఏసీ మెంబర్లు) వేముల సంగయ్య, మిద్దె బాబురావు, సిద్ధిరాంరెడ్డి, భూమ స్వరూపలు సొసైటీకి డబ్బులు బకాయి ఉండి సకాలంలో చెల్లించలేదన్నారు. ఈ కారణంగా డిఫాల్టర్ అయినందున ఈ నలుగురు డైరెక్టర్ల పైన ఇటీవలే జిల్లా కో-ఆపరేటివ్ అధికారి అనర్హత వేటు వేసినట్లు ఆయ న తెలియజేశారు. ఈ సొసైటీ పరిధిలో 13 మంది డైరెక్టర్లు (పీఏసీ మెంబర్లు) ఉండగా అందులో 9 మంది డైరెక్టర్లకు మాత్ర మే పద విలో కొనసాగేందుకు అర్హత ఉందని తెలిపారు. అనర్హత వేటుకు గురైన ఈ నలుగురు డిఫాల్టర్ డైరెక్టర్లకు పదవిలో కొనసాగే అర్హత లేదని సీఈవో మురళి స్పష్టం చేశారు.

కాల్పులు జరిపిన వ్యక్తిని శిక్షించాలి



తులసీదాస్

ఎల్లారెడ్డి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం పోచారం వద్ద గోరక్షక్ కార్యకర్త సోను అలియాస్ ప్రశాంత్‌పై గన్‌తో కాల్పులు జరపిన ఎంఐఎం పార్టీకి చెందిన ఇబ్రహీంపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా గోరక్షక్ ప్రముఖ్ తులసీదాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా గోవుల తరలింపు, గోవధ గుండాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో హిందూ దేవాలయా లపై జరిగిన దాడులకు నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోక వారిపై పిచ్చివాళ్లు అని ముదిరించి, కేసులు కొట్టివేయడానికి గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని ఆరోపించారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం అలాంటి చర్యలను పునరావృత్తం చేస్తే, హిందూ సమాజం ఊరుకునేది లేదు అని హెచ్చరించారు. చర్యలు తీసుకోకపోతే హిందూ సంఘాలన్నీ ఏకమై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడలకు ఎంపికలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సుభాష్‌నగర్, అక్టోబరు23, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్ రావ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల మైదానంలో గురువారం ఎంపికలు నిర్వహించగా సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ సైక్లిస్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరుగుతాయన్నారు. ఈ ఎంపిక పోటీలు బాలురు, బాలికలు అండర్- 14,16,18 విభాగంలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ఫాదర్ జొయెస్ థామస్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి పవన్ కుమార్, ప్రశాంత్, సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు అఫ్సర్, దుర్గా మల్లేష్, రవి, నరేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

సుభాష్‌నగర్, అక్టోబరు23, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని మంత్రి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ మహేష్

ఎల్లారెడ్డి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎల్లారెడ్డి పోలీసులు హెచ్చరించారు. గురువారం పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అందరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, పెండింగ్ చలాన్లు వెంటనే చెల్లించి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

● పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ అరుణ్ కుమార్ సూచించారు. గురు వారం పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ గేట్ వద్ద వాహన తనిఖీలు ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 161వ జాతీయ రహదారి పై వాహనాల వేగం అధికంగా ఉన్నందున వాహనదారులు రహదారి నియమా లు పాటించి ప్రయాణం సాగించాలన్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే రహదారుల జంక్షన్ల వద్ద యూటర్న్ తీసుకునే సమయంలో రహదారికి ఇరువైపులా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. దీంతో పాటుగానే వాహనాలకు సంబంధించి ఏమైనా చలాన్లు ఉంటే వెంటనే చె ల్లించుకోవా లని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బేగంపూర్ గేట్ వద్ద
వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ అరుణ్



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గాలికుంటు నివారణ టీకాలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రుద్రారం, ఆజామాబాద్, రత్నాపూర్ గ్రామాల్లో గురువారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యురాలు అర్చన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామన్నారు. రుద్రారం, ఆజామాబాద్, రత్నాపూర గ్రామాల్లో 216 ఆవులు, ఎద్దులకు, 248 గేదెలు, దున్నలకు టీకాలు వేయడం జరిగిందన్నారు. పశుపోషకులు, రైతులు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెటర్నరీ సిబ్బంది అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, స్వప్న, మెహబూబ్, సాయిరెడ్డి, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచాపూర్ (పెద్దారెడ్డి) గ్రామానికి చెందిన అమృతరావు తన పొలం వద్ద విద్యుత్‌షాక్‌కు గురై మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా గురువారం ఆయన అంత్యక్రియలకు హాజరై మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి వారికి అందాల్సిన నష్టపరిహారాన్ని అధికారులతో మాట్లాడి సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ప్రవీణ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి షైలారం బాలు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల క్రితం ఇంటి నిర్మాణానికి మున్సిపల్‌లో అనుమతి తీసుకొని ప్రభుత్వ భూమి 202 సర్వే నంబర్‌ను కబ్జా చేసి ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు నిర్మాణాలను ఆపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకుల ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని సబ్ కలెక్టర్ అబిజ్ఞాన్ మాల్వియా, తహసీ ల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజులకు ఫిర్యాదు చేశారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, ఎంపీడీవో

బాన్సువాడ రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం డీఎల్‌పీవో ప్రసాద్‌రావు, ఎంపీడీవో ఆనంద్ మార్కౌట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సాయం అందిస్తుందని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, నాయకులు దేవేందర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని అడవిలింగాల గ్రామంలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోవడంతో పలువురు లబ్ధిదారులను గురువారం ఎంపీడీవో ప్రకాష్ కలిసి వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్లను అందించాలనే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శంకరయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దీపావళి పండక్కి 138 పేకాట కేసులు

▸▸ 599 మంది అరెస్ట్ ▸▸ 14.15 లక్షల నగదు స్వాధీనం

సుభాష్‌నగర్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 19వ తేదీ నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు పేకాట ఆడుతున్న 599 మందిని అరెస్టు చేసి 138 కేసులు నమోదు చేసినట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో 599 మంది నుంచి రూ.14,15,917 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డివిజన్ల వారీగా చూస్తే.. నిజామాబాద్ డివిజన్లో 42 కేసులు కాగా, 180 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.5,13,042 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆర్మూర్ డివిజన్లో 44 కేసులు కాగా 232 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,50,785 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బోధన్ డివిజన్లో 52 కేసులు నమోదవగా, 187 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,50,730 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. దీపావళి పండగ సందర్భంగా పేకాట స్థావరాలను నియంత్రించడానికి ప్రత్యేక నిఘా, ప్రత్యేక టీం లను, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసినట్లు వివరించారు.

డ్రైనేజీ బాగు చేయించాలి

ఆర్మూర్, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీ 10వ వార్డులో రోడ్డు, డ్రైనేజీలు బాగుపర్చాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు రాజుకు వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా క్షత్రియ స్కూల్ నుంచి ఎస్ఎస్ డ్రింకింగ్ వాటర్ వరకు రోడ్డు పాడవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గతంలో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కార్యాలయంలో ధర్నా చేపట్టారు. స్కూల్‌కు వెళ్లడానికి రాజరాం నగర్ కాలనీ, టీచర్స్ కాలనీ విద్యార్థులకు నానా అవస్థలు పడుతున్నారని ఇకనైనా పరిస్థితిని అర్థం చేసుకొని రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు విన్నవించుకున్నారు.

ప్రమోద్ కుటుంబానికి పీసీసీ అధ్యక్షుడి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

సుభాష్‌నగర్, అక్టోబరు 23, ఆంధ్రజ్యోతి: ఇటీవల నిజామాబాద్ నగరంలో కానిస్టేబుల్ ప్రమోద్ హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా బాధిత కుటుంబాన్ని పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదా రు షబ్బీర్ అలీ గురువారం పరామర్శించారు. ఈ సందర్భం గా జిల్లాకేంద్రంలోని బ్యాంక్ కాలనీలో గల ప్రమోద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమోద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున కోటి రూపాయల పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, జిల్లా కేంద్రంలో 300 గజాల ఇంటి స్థలం ఇవ్వన్నామని తెలిపారు. ప్రమోద్ కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పోలీసు వర్గాల్లో కొంతమేర ఉపశమనం కలిగించిందన్నారు. పోలీసుశాఖ సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ప్రమోద్ కుటుంబానికి అందించే సహాయం, ఆయన పోలీసు శాఖ ద్వారా ప్రజలకు చేసిన సేవలకు ప్రభుత్వ గౌరవ సూచకమన్నారు. ప్రమోద్ కుటుంబానికి పార్టీ తరఫున రూ.2 లక్షలు, రియాజ్‌ను పట్టుకునే క్రమంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆసిఫ్ కుటుంబానికి రూ.లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి కోసమే సీఎంను కలిశా

▸▸ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థినులతో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే

బాన్సువాడటౌన్, నసురుల్లాబాద్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తన స్వార్థం కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేదని, బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే కలిశానన్నారు. సీఎం దగ్గర తన స్వార్థం కోసం వెళ్లినట్లు నిరూపిస్తే రాజీనామా చేసేందుకు సిద్ధమని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నపుడు మాజీ సీఎం కేసీఆర్‌ను అడిగి బాన్సువాడ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. అనంతరం 155 మంది లబ్ధిదారులకు రూ.1.55 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సొసైటీ చైర్మెన్ ఎర్రవల కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, పిట్ల శ్రీధర్, నార్ల రవీందర్, ఎజాస్, నాయకులు ఉన్నారు.

● నసురుల్లాబాద్ మండలంలోని 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ముగ్గురికి షాదీముబారక్ చెక్కులను మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పోచారం అందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ విఠల్, నాయకులు మల్లేష్, వెంకటరమణ, ప్రతాప్, సాయిలు, తహసీల్దార్ సువర్ణ, ఆర్ఐ వెంకటస్వామి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

● ఇటీవల ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల వద్ద సమయానికి బస్సులు లేక రోడ్డుపై వేచి ఉన్న కళాశాల విద్యార్థినిల సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే పోచారం తక్షణమే డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సును ఏర్పాటు చేయించారు. కాగా ఏర్పాటుచేయించిన బస్సులో ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, విద్యార్థినులతో కలిసి గురువారం ఆయన ప్రయాణించారు. తమ సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యేకు పుష్పాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు.

డిఫాల్ట్ మిల్లులకు కేటాయింపులు లేవు..

(5వ పేజీ తరువాయి)

30 మిల్లులు డిఫాల్ట్‌లో..

జిల్లాలో గతంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆయా రైస్‌మిల్లులకు కేటాయించారు. అయితే కొన్ని రైస్‌మిల్లులు సకాలంలో సీఎంఆర్‌ను తిరిగి ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికీ సీఎంఆర్ కేటాయించని పలు రైస్‌మిల్లులను డిఫాల్ట్ కింద చేర్చారు. ఇటీవల కాలంలో రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. పలు మిల్లుల్లో కేటాయించిన ధాన్యం నిల్వలు లేకపోవడంతో వాటిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆ ధాన్యాన్ని ఎక్కడికి తరలించారు, పాడైన ధాన్యం ఏం చేశారనే దానిపై లెక్కలు తీస్తున్నారు. ఇలా 30 రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడం, సీఎంఆర్ సకాలంలో పెట్టకపోవడంతో వాటిని డిఫాల్ట్ కింద చేర్చారు. అయితే 2024-25కు వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ రైస్‌మిల్లుల వద్దనే ఉంది. వానాకాలానికి సంబంధించి 2.90లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ ఇవ్వాల్సి ఉండగా 2 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇచ్చారు. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లుల వద్దే ఉంది. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లర్ల వద్దే ఉంది.

52 మిల్లులకు ధాన్యం కేటాయింపులు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో 4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు పౌర సరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 427 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత పక్షం రోజుల కిందట ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. బ్యాంక్ షూరిటీ ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం నిల్వలను బట్టి 10 శాతం గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో 32 టన్నుల సామర్థ్యానికి 40 వేల క్వింటాళ్ల ధాన్యం, 40 టన్నుల సామర్థ్యానికి 50 వేల క్వింటాళ్లు, 50టన్నుల సామర్థ్యానికి 60వేల క్వింటాళ్లు, 60 టన్నుల సామర్థ్యానికి 70వేల క్వింటాళ్ల కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. రైస్‌మిల్లులకు ఇదే ప్రాతిపాదికన జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 52 రైస్‌మిల్లర్లు షూరిటీలు ఇచ్చారని వారికి మాత్రమే కేటాయింపులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 427 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. సన్న రకం వడ్లను కొనుగోళ్లకు అవసరమున్న చోట్ల ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 422 మంది రైతుల నుంచి 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా 10 సెక్టార్‌లలో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పిస్తున్నారు. కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలిస్తున్నారు.

బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకే ధాన్యం - వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, కామారెడ్డి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ధాన్యం కేటాయింపులు రైస్‌మిల్లులకు చేస్తున్నాం. నిబంధనల మేరకు బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చిన రైస్‌మిల్లులకే ధాన్యం కేటాయింపులు చేశాం. ఇప్పటి వరకు 52 రైస్ మిల్లర్లు బ్యాంక్ షూరిటీలు అందించారు. పత్రాలన్నింటిని పరిశీలించిన ఆ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆ మిల్లులకు తరలిస్తున్నాం. మిగితా రైస్‌మిల్లుల షూరిటీ పత్రాలను పరిశీలించి కేటాయింపులు చేస్తాం.

సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

(5వ పేజీ తరువాయి)

లేదని హెచ్చరించారు. మార్కెట్ పూర్తి చేసిన గ్రామాల వివరాలు ప్రతి రోజూ అప్‌డేడ్ చేయాలని వంద శాతం లక్ష్యాన్ని నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రత్యేక మానిటరింగ్ బృందాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్లు నిర్మించుకునే సమయంలో ఇబ్బందులు తలెత్తితే నిర్మాణానికి అవసరమైన నిధులను మహిళ సంఘాల ద్వారా లోన్ రూపంలో అందించాలని, లబ్ధిదారులు ఇళ్లు సమయానికి పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. జీపీ, వార్డుల వారిగా సమావేశాలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల్లో పురోగతిని తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తగిన చర్యలు తీసుకోవాలి

రామారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలభైరవ స్వామి ఆలయంలో టెండర్ ప్రక్రియను క్రిస్టియన్‌కు అప్పచెప్పడం విశ్వహిందూ పరిషత్ ఖండిస్తూ గత మూడు నెలల క్రితం ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈవో) ప్రభు పై మిగతా అధికారులకు ఈ విషయంపై చర్చించి ఆటెండర్‌ను క్యాన్సల్ చేసి హిందువులకు ఇవ్వాల్సిందిగా విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేయడం జరిగింది. గురువారం వినతిపత్రం పై తగు చర్యల నిమిత్తం ఇవ్వడం జరిగింది. నిర్వహణ అధికారులు ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో నిర్వహణదికారి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎండోమెంట్ కమిషనర్ విజయ్ రామారావు కలిసి ఇట్టి విషయంపై చర్చించి తగు చర్యలు తీసుకోగలరని హిందూ ఆలయాల్లో అన్య మతస్తుల అగాయిత్యాలు అరాచకాలు వ్యాపారాలు మానిపించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ కార్యదర్శి త మ్మల కృష్ణ, కామారెడ్డి జిల్లా కోశాధికారి అమ్ముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు భక్తిమార్గంలో నడవాలి

భిక్కనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు భక్తిమార్గంలో నడవాల్సిన అవసరం ఉందని శివస్వాములు అన్నారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన 8 మంది గురువారం మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో శివమాల ధరించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇస్రో సందర్శనకు అక్కాపూర్ విద్యార్థిని



నాగారపు శరణ్య

మాచారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇస్రో సందర్శనకు మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని నాగారపు శరణ్య ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మంజుశ్రీ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో పదవ తరగతి విద్యార్థినీలకు భారత అంతరిక్ష పరిశోధన విజయాలు, పురోగమనంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీ పరిక్ష లో మంచి ప్రతిభ చూపి శరణ్య ఎంపికైందన్నారు. ఈ పోటీ పరీక్షల్లో 246 మంది విద్యార్థులు పోటీపడగా ప్రతిభ చూపిన మొదటి 30 మందిని ఇస్రో సందర్శనకు ప్రభుత్వ ఖర్చులతో పంపించన్నుట్లు తెలిపారు. ఈ మేరకు శరణ్య ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

గిద్ద గ్రామానికి చెందిన విద్యార్థిని ఎంపిక



నిహారిక

రామారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిహారిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఇస్రో సందర్శనకు ఎంపికైనట్లు గిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

దోమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ లబ్ధిదారులకు ఆర్డర్‌కాపిని అందజేశారు. కొలతల ప్రకారం ముగ్గుపోసి ప్లానింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆసాని సంతోష్‌రెడ్డి, నాయకులు ముదాం రాంలు, లింగం, స్వామి, సిద్ధరాములు,శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

» ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు

మహ్మద్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. గురు వారం మహమ్మద్‌నగర్ మండలకేంద్రంతో పాటుగా మండలంలోని కొమలంచలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి వారికి ధాన్యాన్ని విక్రయించి ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రైతుల అభ్యున్నతికి పాటుపడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2389, బీ గ్రేడ్ రకానికి రూ.2369ల మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లతా, ఎంపీడీవో వెంకట సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఆకాష్, లోక్యనాయక్, కలిక్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు

కొనసాగుతున్న శరభేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



శరభేశ్వర స్వామి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

» ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ఏర్పాటు

» అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

కామారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో నూతనంగా శరభేశ్వర స్వామి శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేయడానికి పూజారులు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో శాంతి పఠనం మంటపదేవత, ప్రాతకాల పూజలు, ప్రధాన దేవతా మూలమంత్ర హవనం, నేత్రోన్మీలనం మహాస్నపనం ప్రాసాదాధివాసం ప్రాసాదోత్సర్గము, ధ్వజ సంస్కారం, ధ్వజశిఖర ప్రతిష్ఠ, కుటీరశాంతి, హోమాలు, మూర్తి మూర్త్యధిపతి లోకపాల హోమాలు నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రం పూజలు, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తులు ఆలయానికి చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శుక్రవారం శరభేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజలు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

తాడ్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రత్యేక అధికారి కె. లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కల కొనుగోలు సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసిందని అన్నారు. మక్కలు క్వింటాలుకు 2,400 రూపాయలుగా ధర నిర్ణయించారని తెలిపారు తేమశాతం 13.5గా ఉండేటట్లు చూడాలని అన్నారు. ఒక ఎకరానికి 18 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేస్తామని తెలిపారు. మొక్కల కొనుగోలు కేంద్రంలో ప్రత్యేక అధికారి మరియు సొసైటీ చైర్మన్ కపిల్ రెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. నెల రోజులు గడిచిన తమ సొసైటీ బాధ్యతలు అప్పజెప్పడం లేదని చైర్మన్ కపిల్ రెడ్డి అన్నారు. రైతుల కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏది ఏమైనా అధికార పార్టీ అక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పుడు అధికార పార్టీ నాయకులు ఒక్కరు కూడా రాకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. ఇందులో ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి, డైరెక్టర్లు సంజీవరెడ్డి, పీసు రాజిరెడ్డి, కార్యదర్శి కే. నర్సింలు, ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

తాడ్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని తాడ్వాయి ఎస్సై నరేష్ తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పి రాజేష్ చంద్ర ఆదేశానుసారం కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందంచే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులు తమ ప్రాణాలను లెక్కచేయ కుండా ప్రజల కోసం పనిచేస్తారని తెలిపారు. ఎంతోమంది పోలీసులు తమ జీవి తాలను లెక్కచేయకుండా అమరులయ్యారని వారి త్యాగాలను మర్చిపోలేమ న్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి ఉపాధ్యాయులు నర్సారెడ్డి, రాజు, పోలీసులు సాయిబాబా, నరేష్, దేవిచంద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

గోరక్షకులపై దాడి చేసిన నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోరక్షకులపై దాడి చేసిన నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్‌కు బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర రాజధానిలో గోవులను తరలిస్తున్న ఎంఐఎం నాయకులను అడ్డుకున్నందుకు సొనుసింగ్‌పై తుపాకితో కాల్పులు జరిపాడని అన్నారు. రాష్ట్రంలో చట్టవ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాద మూకలు స్వైర విహారంపెరిగిపోయిందని తెలిపారు.ఎంఐఎం నాయకుల రాక్షసత్వానికి బీఆర్‌ఎస్ పార్టీ మౌనంగా ఉండి మద్దతు తెలిపితే కాంగ్రెస్ వెన్నుతట్టి ప్రోత్సహిస్తుందని ఆరోపించారు.అమాయక ప్రజలపై, అధికారయంత్రాంగంపై,చివరికి రక్షణ కల్పించే పోలీసుల గుండెల్లో ఎంఐఎం గుండాలు దాడులుచేస్తుండడంతో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండిగట్టి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నిరసన తెలిపితే అక్రమ అరెస్ట్‌లుచేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, వేణు, కడెం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలి

తాడ్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను కట్టుకునే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని మండల అధికారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు జూకంటి వెంకట్ రెడ్డి అన్నారు. ఈయన గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండో విడతలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు అన్నారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లను వెంటనే పూర్తి చేయించాలని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఈయన అన్నారు. ఇందులో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపిఓ సవితారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంబీర్ శ్యామ్ రావు, గైని శివాజీ, మేకల రాజు, వెంకట్రాంరెడ్డి ఉన్నారు.

సంక్షిప్తం

స్థల పరిశీలన

దోమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గొట్టిముక్కల గ్రామంలో వరిధాన్యం ఆరబెట్టేందుకు ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ స్థలపరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయ నున్న కొనుగోలు కేంద్రం కోసం చెరువు పక్కన స్థలాన్ని చదును చేయాలని ఇన్‌చార్జ్ రాజుకు సూచించారు. ఈ కా ర్యక్రమంలో సీసీ రామకృష్ణ, సీఏ రాజు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సాయం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఆటోడ్రైవర్ లడ్డుకు టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డం చంద్ర శేఖర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పొందుర్తి దగ్గరలో ఆటో ప్రమా దంలో లడ్డుకుటుంబీకులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. పేదకుటుంబమైన లడ్డుకు సాయం అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శంకర్‌రావు, పండు, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

కామారెడ్డిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కామా రెడ్డి విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పాడి రైతుకు నష్టపరిహార చెక్కును గురువారం ఏడీఈ కిరణ్ చైతన్య అందించారు. జిల్లా కేంద్రానికి చెందిన పాడిరైతు తోట రాజేష్‌కు చెందిన రెండు గేదెలు రెండునెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. దీంతో పశువైద్య శాఖ, విద్యుత్‌శాఖ అధికారులు విచారణ చేపట్టి బాధిత రైతుకు రూ.80 వేల నష్టపరిహారం అందించారు.

ఇస్రోజివాడికు ఆర్టీసీ బస్సు

కామారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామానికి కొత్త ఆర్టీసీ బస్సు సేవలు అందించడం అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత కాలంగా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. దీంతో ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి గ్రామానికి ఉదయం 7:30 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు బస్సు సౌకర్యం కల్పించడం పట్ల ఆర్టీసీ మేనేజర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

భిక్కనూరు , అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సం దర్భంగా డ్రగ్స్ దాని పర్యావసనాలు, డ్రగ్స్ నిర్వహణ లో పోలీసుల పాత్ర అనే అంశాలపై నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీల్లో 30మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన విద్యార్థులకు పోలీసులు బహుమతు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌యాదవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండ: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గురువారం దోమకొండ ఎస్‌ఐ స్రవంతి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర- విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఆటపాటల్లో రాణించాలి

రామారెడ్డి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రామారెడ్డి ఎస్సై భువనేశ్వర్ రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాలలో పలు కార్యక్రమా లను నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాను సారం వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్, ఉపాధ్యాయులు బాలరాజు, లక్ష్మణ్, లింగం, పాల్గొన్నారు.

నవల పుస్తకాల అందజేత

కామారెడ్డిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి కాసర్ల రామచంద్రం తన సొంత సేకరణలోని 262 తెలుగు నవలలను కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి గు రువారం అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి ఆయనను సన్మానించి కవులు, రచ యితలు రచించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందించాలని కోరారు. తెలుగు సాహిత్యాభివృద్ధికి కాసర్ల రామచంద్రం సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని తెలిపారు. విద్యార్థులకు, పాఠకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, గ్రంథ పాలకురాలు మౌనిక పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడికి సన్మానం

కామారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నంద రమేష్‌ను జిల్లా కోర్టు అవరణలో గురువారం కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు దేవరాజుగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం న్యాయవాదులకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌గోపాల్, సీనియర్ న్యాయవాదులు వెంకట్‌రాంరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియో థెరపీ చికిత్సలు

భిక్కనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం వైద్యుడు నవీన్‌సాయి దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, వైద్యుడు నవీన్‌సాయి మాట్లాడుతూ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వల్ల మానసిక ఉపశమనం కలుగుతుందని, వీరికి క్రమం తప్పకుండా ప్రతీ గురువారం జరిగే ఫిజియోథెరపీ శిబిరాన్ని తీసుకురావాలన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

భిక్కనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు వైద్యులు అందించే సూచనలు పాటిం చాలని భిక్కనూరు వైద్యురాలు దివ్య అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మఒడి కార్యక్రమంలో బాగంగా గర్భిణీలకు వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ గర్భిణీలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రై వేటుకు దీటుగా అన్ని వసతులు సౌకర్యాలు ఉన్నాయన్నారు. గర్భిణీలకు రక్తపరిక్షలు, ప్రసవా లపై ఆశాలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు గర్భిణీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, ల్యాబ్ టెక్నిషియన్ వనశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారి బాబాపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని జోగ్రం గుట్ట తండాకు చెందిన గిరిజన రైతు కాట్రాజ్ సుభాష్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఫారెస్ట్ అధికారి బాబాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. గురువారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సుభాష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా డబ్బుల కోసం సుభాష్‌ను వేధిస్తు తనకు అనుకులంగా లేకపోవడంతో పలుమార్లు తప్పుడు కేసులు పెట్టించి జైలుకు వెళ్లివచ్చినప్పటికి, కోర్టు ఆర్డర్‌లు ఉన్నప్పటికి కోర్టుతో మాకు సంబంధం లేదని సుభాష్‌ను వేధించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రాజంపేట ఎస్సై సైతం ఓ స్మగ్లర్, రౌడీషీటర్‌లను ట్రీట్ చేసినట్లు ఇంటిచుట్టు తిరుగుతూ గల్లపట్టి తీసుకువచ్చి అందరి ముందు అవమానకరంగా మాట్లాడడం బాధకరమన్నారు. .గిరిజన రైతు ప్రాణాలకు ఏదైన జరిగితే పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామనిహెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, రజనికాంత్, భాను, దశరథ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



డాకమొల్ల కుమార్ (ఫైల్)

నాగిరెడ్డిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం నాగిరెడ్డిపేట మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాండూరు గ్రామానికి చెందిన డాకమొల్ల కుమార్ (18) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడని, డబ్బుల కోసం తండ్రిని వేదించేవాడని తెలిపారు. బుధవారం రాత్రి త్రాగిన మత్తులో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు,ఎల్లమ్మ, సంగయ్య ఒక సోదరుడు ఉన్నాడని తెలిపారు. మృతునికి వివాహం కాలేదని అన్నారు. గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ తిరిగేవాడని తెలిపారు. బుధవారం రాత్రి జీవితంపై విరక్తి చెందిన కుమార్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని తండ్రి సంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలియోను తరిమేద్దాం

(5వ పేజీ తరువాయి)

అధికారులు పేర్కొంటున్నారు. అలా వ్యాప్తి చెందిన వైరస్ క్రిములు, రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదంటే రోగి మలంలో ఎక్కువగా బహిర్గతం అవుతాయి. అలా మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాల మీద వాలడం ఆ ఆహార పదార్థాలను తిన్న ఆరోగ్యవంతమైన చిన్నారుల కడుపులో ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. కడుపులో గాని, గొంతులో గాని ఈ వ్యాధి క్రిములు ఒకసారి ప్రవేశించి అధిక సంఖ్యలో వృద్ధి చెందుతూ క్రమంగా వ్యాధి ముదురుతుంది. అధిక సంఖ్యలో ఉత్పత్తి అయిన క్రిములు రక్తంలో కలిసి నరాలను జీవకణాలను ప్రభావితం చేస్తాయి.

రెండు సార్లు పోలియో టీకాలు

పోలియో వ్యాధి ఎక్కువగా చిన్నారులకు సోకుతుండడంతో వారితో పాటు చుట్టు పక్కల పిల్లలకు వ్యాప్తి చెందకుండా ఉండడానికే కేంద్ర ప్రభుత్వం ప్రతీ యేటా పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతూ వస్తోంది. అయితే ఈ ఏడాది జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించలేదు. ప్రభుత్వ ఆస్పత్రిలో 10 ఏళ్ల క్రితం నుంచే అప్పుడే పుట్టిన పిల్లలకు బుధవారం, శనివారాల్లో పోలియో టీకాలు వేస్తున్నారు. దీంతో జిల్లాలో పోలియోకు సంబంధించిన కేసులు జీరోగానే నమోదవుతున్నాయి. జిల్లాలో గత నెల వరకు ఓపీవీ(ఓరల్ పోలియో వ్యాక్సిన్), ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్)లను 11,793 మంది పిల్లలకు వేసినట్లు అధికారులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతీ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ కమలాకర్ అన్నారు. గురువారం తహసీల్దార్ సత్యనారాయణతో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్నకు ప్రభుత్వ మద్ధతు ధర రూ.2400 ఉన్నందున రైతులు బాగా ఆరబెట్టిన మొక్కజొన్నలను శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, సీఈవో విఘ్నేష్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు రాజారెడ్డి, మధుసూదన్ రెడ్డి, బాల్‌రెడ్డి, బాబయ్య, నాయకులు వడ్ల రాజేందర్, పోలీస్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

దోమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో భిక్కనూర్ క్లస్టర్ పరిధిలోని 12 సంఘాల కార్యదర్శులు, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, ట్యాబ్ ఆపరేటర్లతో వరి ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి సురేష్, మాసీద్దీన్, పన్యాల బాల్‌రెడ్డి, రాంచంద్రం, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి	డ్యూడ్
వెంకటేశ్వర	కె- ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230